## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

**పార్వతీపురంటౌన్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పురపాలక సంఘం పరిధిలో గల కొత్తవలస 5వ వార్డు కొత్తపోలమ్మ రాజీవ్ కాలనీలో జరుగుతున్న డిసిల్టింగ్ డ్రైవ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఏఎస్‌ఓ, శానిటేషన్ మేస్త్రీ, శానిటేషన్, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

### రెండవ రోజు 147మందికి ఈసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది

**పార్వతీపురంటౌన్:** ఎమ్మార్‌నగరం పాలిటెక్నికల్ కళాశాలలో రెండవ రోజు 147మందికి ఈసెట్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ విలియం క్యారీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ నెల 10వరకు పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### విశాఖపట్నానికి బస్ చార్జీ రూ.5 పెంపు

**సాలూరు:** సాలూరు నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు ఆర్టీసీ బస్ టిక్కెట్ ధర పెరిగింది. ఇంతవరకు సాలూరు నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు రూ.185 టికెట్ ఉండగా, అదనంగా రూ.5 పెంచి రూ.190 చేసినట్లు ఆర్టీసీ డీఎం భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. విజయనగరం –విశాఖపట్నం మధ్య గల టోల్ గేట్ వల్ల ఈ టిక్కెట్ ధర పెంచినట్లు తెలిపారు. పెంచిన ఈ ధర రెండు రోజుల నుంచి అమల్లోకి వచ్చినట్లు చెప్పారు.


### ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



పోలీసులు పట్టుకున్న నంబర్ ప్లేట్లు లేని ద్విచక్రవాహనాలు

**సాలూరు:** ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ సీఐ వాసునాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాలూరు పట్టణంలో నంబర్‌ప్లేట్లు లేకుండా నడుపుతున్న 20 ద్విచక్రవాహనాలను పోలీసులు పట్టుకున్నారు. వాటికి అపరాధరుసుము విధించడంతో పాటు, నంబర్ ప్లేట్లను వాహనాలకు వేయించారు. నంబర్‌ప్లేట్లు లేకుండా వాహనాలను నడపడం వల్ల కలిగే అనర్థాలను వాహనచోదకులకు సీఐ వివరించారు.

### ఉపాధి పనులు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

**భామిని:** వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయనే కారణంతో ఉపాధి పనులు నిలిపివేయరాదని.. వర్క్ డిమాండ్ మేరకు పని దినాలు కొనసాగించాలని ఉపాధి ఏపీడీ జి.శ్రీహరి అన్నారు. ఏపీఓ ఈ. తులసీదాస్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీహరి మాట్లాడుతూ, రైతుకు ప్రయోజనం కలిగే నీటి కాలువ, ఫారంపాండ్స్, హార్టికల్చర్ పనులు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోనూ ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు గల గిరిజనులకు 150 పనిదినాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఈసీ రమణమూర్తి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

# దోమల నివారణకు సత్వరచర్యలు

- గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

**సీతానగరం:**

మండలంలోని గ్రామాల్లో దోమల ఉద్ధృతిని అరికట్టేందుకు, నీటిని శుద్ధిచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు పంపిణీకి సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కలుషిత నీరు, దోమల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులు విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు అన్నిగ్రామాల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయించి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇళ్లలోని చెత్తను వీధుల్లో వేయడం వల్ల దోమలకు స్థావరాలు ఏర్పడి వచ్చే అనర్థాల నిర్మూలనకు ముందు జాగ్రత్త చర్యగా వీధుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ, బోర్ల వద్ద బ్లీచింగ్ చల్లిస్తున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లున్న గ్రామాల్లో ట్యాంక్‌లను శుద్ధి చేయడం, ప్రధాన పైప్‌లైన్లకు ఏర్పడిన లీకులను నివారించడానికి అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. సీపీడబ్ల్యూఎస్ సంప్‌ల్లో క్లోరినేషన్ చేస్తున్నారు. అలాగే సువర్ణముఖి నదిలో ప్రవహిస్తున్న కలుషితమైన నీరు వాడకాన్ని తగ్గించాలని, కలుషిత నీరు వాడవద్దని ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం జరుగుతోంది. కలుషిత నీరువల్ల అతిసార కేసులు అక్కడక్కడా నమోదు కావడం, జ్వరాలబారిన పడడం వల్ల తాగునీరు విషయంలో వైద్యారోగ్యశాఖ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య సూత్రాలను ప్రజలు పాటించాలని డెంగీ, అతిసార, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడానికి వైద్యారోగ్య శాఖ గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జానుమల్లువలసలో కాలువల్లో పూడికలు తీస్తుండగా, కేఎస్‌పురంలో ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లో మురుగును తీయిస్తూ, కలుషితనీటిని మళ్లిస్తున్నారు. అలాగే పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేటలో బోరు మరమ్మతులు, చిన భోగిలి, లచ్చయ్యపేటలో మంచినీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్నారు.



జానుమల్లువలస కాలువల్లో పూడికలు తీయిస్తున్న సర్పంచ్ వెంకటనాయుడు



కేఎస్ పురంలో ఓవర్‌హెడ్‌ట్యాంకులో చెత్తను తొలగిస్తున్న కూలీలు



ట్యాంకులోని కలుషితనీరును మళ్లిస్తున్న దృశ్యం

### దోమల ఉద్ధృతిని అరికట్టేందుకు ప్రాధాన్యం



అరకొరగా కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్న దోమల ఉద్ధృతిని అరికట్టడానికి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. కాలువల్లో పూడికలు తీయించడం, ట్యాంకుల్లో క్లోరినేషన్, వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తూ దోమలనివారణ మందు పిచికారీ చేయిస్తున్నాం. వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకుల సమన్వయంతో వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. – కె.కుమారవర్మ, ఈఓపీఆర్డీ, సీతానగరం

# ప్రజలకు ఎంతో మేలు చేశాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

**సీతానగరం:** ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పార్టీతో పాటు తాను కూడా అండగా ఉంటానని ఎవరూ అధైర్యపడవద్దని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్వీ పార్థసారథి నివాసం వద్ద శుక్రవారం పార్టీమండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధస్థాయిల్లో సేవలందిస్తున్న నాయకులు,కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించి ప్రజలకు తోడుగా నిలిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాయకత్వాన తామంతా సమన్వయంతో మండలంలో పార్టీకి పూర్వస్థితిని తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ తెలిపారు.

**మనో ధైర్యం కోల్పోవద్దు**

కార్యక్రమంలో పార్టీ నాయకులనుద్దేశించి మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఓటమి మనలో కొంత నిరాశకు గురిచేసినప్పటికీ మనం ప్రజల ముందు తలదించుకునే పరిస్థితి అయితే లేదని జగనన్న నాయకత్వంలో ఐదేళ్ల పరిపాలనకాలంలో ప్రజలు మనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిఒక్కరికి మేలు జరిగేలా చేశామన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులెవరూ మనోధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదని, జగనన్న పాలనలో నాయకత్వంలో గడిచిన ఐదేళ్ల పరిపాలన కాలంలో అర్హతనే ప్రామాణికంగా చేసుకుని కుల మత వర్గ వర్ణ పార్టీల భేదం లేకుండా ప్రతిఒక్కరికి మేలు చేశామన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలందరికీ మేలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పి.ఈశ్వర నారాయణ, పీఏసీఎస్, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్ రామకృష్ణ, పార్థసారథి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు డి. నాగరత్నం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్గొన్న మండల నాయకులు, కార్యకర్తలు

# ల్యాబ్స్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ జి.పగడాలమ్మ

**పార్వతీపురంటౌన్:** అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ కోరారు. ఈ మేరకు పార్వతీపురంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్చార్జ్‌లతో ల్యాబ్స్ పనితీరుపై శుక్రవారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పాఠశాలను ఒక ఇన్నోవేషన్ హబ్‌గా చేయాలన్న సంకల్పంతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను ఎంపిక చేసిన పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు. రూ.25 లక్షలతో రూపొందించిన ఈ ప్రయోగశాలలో విద్యార్థులకు రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, 3డి ప్రింటింగ్ వంటి అత్యాధునిక పరికరాలను అందచేసినట్లు చెప్పారు. ప్రతి ల్యాబ్ పాఠశాల విద్యార్థులను అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లే విధంగా ప్రాజెక్టులను రూపకల్పన చేయాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అటల్ టింకేరింగ్ ల్యాబ్స్ ప్రయోగశాలల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అప్కాస్ట్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, బేయర్స్ కంపెనీ ప్రతినిధి విరజాజి, రాములు, ఏటీఎల్ ల్యాబ్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

### అదనపు సీట్లకు నోచుకోని గిరిజన విద్యార్థులు

**సాలూరు:** గిరిజన గురుకుల కళాశాలల్లో అదనపు సీట్లు కేటాయించకుండా గిరిజన సంక్షేమ గురుకుల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది జూన్ నెల నాటికి గిరిజన గురుకుల కళాశాలల్లో అదనపు సీట్లు కేటాయించి భర్తీ చేసేవారని, ఈ ప్రభుత్వంలో నేటికీ సీట్లు పెంచకపోవడంతో పది ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికి నేరుగా రేషన్ సరుకులు అందించాలని, వైటీసీలో ఏర్పాటుచేసిన గిరిశిఖర గర్భిణుల వసతి గృహ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. కొటికిపెంట ఏకలవ్యపాఠశాల ప్రిన్సిపాల్‌పై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీఓ ఆధ్వర్యంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని కోరారు.

### చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి



పిల్లలతో హ్యాండ్ వాషింగ్ చేయిస్తున్న ఏఎన్ఎం జయలక్ష్మి, అంగన్వాడి టీచర్ సరోజిని

**సీతానగరం:** అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపట్ల సిబ్బంది హ్యాండ్‌వాషింగ్, తాజా ఆహారపదార్థాలు సమకూర్చడం పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రాధాకాంత్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల పరిధిలో గల శుక్రవారా(డ్రైడే)న్ని పురస్కరించుకుని చేపడుతున్న కార్యక్రమాలపై డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఏఎస్ఎంల పర్యవేక్షణలో పిల్లకు చేతుల శుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు సమకూర్చడం, తాజా ఆహార పదార్థాలు, స్నాక్స్ సమకూర్చడం వంటి పనులు చేయాలని సూచించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఐసీడీఎస్ అధికారులు జారీ చేస్తున్న మార్గదర్శకాలను విధిగా పాటించాలని, గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీలకంఠాపురంలో పిల్లలతో హ్యాండ్ వాషింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### భూసారం పెంపొందించుకోవాలి



లఖనాపురంలో నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న రాజారావు

**గరుగుబిల్లి:** నవధాన్యాల సాగుతో భూసారాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌వైఎస్ఎస్ ట్రాన్స్‌ఫర్మేషన్ సభ్యుడు ఎస్. రాజారావు అన్నారు. మండలంలోని లఖనాపురం, ఖడ్గవలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న నవధాన్యాల పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవధాన్యాలు సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, దేవీప్రసాద్, రైతులు సత్యనారాయణ, శరత్, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని చేపల చెరువులకు నోటీసులు

- జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక

**పార్వతీపురం:**



అనుమతులు లేకుండా చేపల చెరువుల పెంపకం చేపట్టకూడదని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో మత్స్య శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో జరుగుతున్న చేపల పెంపకం సాగుపై సమీక్ష నిర్వహించిన పిమ్మట మాట్లాడుతూ సుస్థిరమైన చేపల పెంపకం కోసం కాలుష్యం, వ్యర్థాలు లేకుండా రైతులు తమ స్వంత భూమిలో చేపల పెంపకం చేపట్టాలని తెలిపారు. చేపల సాగు చేపట్టే రైతులు మత్స్య శాఖ, వ్యయసాయశాఖ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, రెవెన్యూ శాఖలతో ఏర్పాటైన (డిస్ట్రిక్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ) ద్వారా అనుమతులు పొంది మాత్రమే చేపల పెంపకం చేయాలని సూచించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ పాచిపెంట మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో కేవలం ప్రొవిజనల్ పర్మిషన్ మాత్రమే (చెరువు తవ్వేందుకు) పొంది, ఫైనల్ పర్మిషన్ లేకుండా, దేవదాయశాఖ భూమి 2.80 ఎకరాలు, 6.80 ఎకరాలు ఆక్రమించి భంజ్‌దేవ్ చేస్తున్న చేపల పెంపకం అనధికారమైనదని, సదరు భూమికి చట్టపరమైన హక్కుదారు కాదని నిర్ధారించి, హై కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం 15 రోజులలోగా దా స్థలం ఖాళీ చేసి, తహసీల్దార్, పాచిపెంట మండలం వారికి అప్పజెప్పవలసినదిగా ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో వ్యయసాయశాఖ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ

**పార్వతీపురంటౌన్:** యూపీహెచ్‌సీలో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయపార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జగన్నాథపురం యూపీహెచ్‌సీలో ప్రతిరోజూ 50 నుంచి 100 మంది వరకు రోగులు ఓపీ విభాగానికి తమ అనారోగ్య సమస్యల గురించి వస్తుంటారన్నారు. పేషెంట్స్‌ని చూడడానికి డాక్టర్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుత డిప్యూటేషన్ డాక్టర్ ఎన్వి విద్యా కుమార్ అందుబాటులో ఉండడం లేదని, ఆస్పత్రిలో వైద్యుని కొరత ఉందని, రోగులకు ఇబ్బంది లేకుండా రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని, లేనిప క్షంలో ఉన్న డాక్టర్‌ను రెగ్యులర్ చేయాలని కోరారు. దీనికి డీఎంహెచ్ఓ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్
- స్టాఫ్ డయేరియాపై సమీక్ష

**పార్వతీపురంటౌన్:** సీజనల్ వ్యాదుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిసనర్ శ్రీనివాస్ అన్నారు. స్టాప్ డయేరియా, సీజనల్ వ్యాధులపై మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులలో డీసిల్టింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ కచ్చితంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు సరఫరా సమయంలో సంబంధిత ఎనిమిటి సెక్రటరీలు క్లోరినేషన్ టెస్టులు తరచూ చేసి రిపోర్ట్‌ను కార్యాలయంలో సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. పైప్ లీకేజీలను గుర్తించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ సెక్రటరీలు సచివాలయ వార్డు పరిధిలో ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు జింక్ టాబ్లెట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కుటుంబ సభ్యులకు అందజేసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఏయస్ఓ,ఎఫ్1, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పంటల అమ్మకాలు



జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద అమ్మకాలు చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**పార్వతీపురంటౌన్:** ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేసి పండించిన పంటల పార్వతీపురం మన్యం జిల్లా కార్యాలయాల సముదాయంలో అమ్మకాలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ శారద, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.షణ్ముఖరాజు తెలిపారు.

ఈ మేరకు శుక్రవారం రైతులు పండించిన పంటలను తీసుకుని వచ్చి అమ్మకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ తిరుపతి, ఎంటీఎస్‌లు నరసింహ, నిర్మల రైతులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండాలి

**వంగర:** గ్రామాల్లో మహిళా స్వయంశక్తి సంఘాలు ఏ గ్రేడులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజాం వెలుగు శాఖ ఏరియా కో ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాల యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 గ్రామైక్య సంఘాల పరిధిలో ఉన్న 1004 సంఘాలను ఏ గ్రేడులో ఉండే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. మహిళలు జీవనోపాధులు పెంపొందించుకునేందుకు స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎస్ఆర్ఎల్ఎం పరిధి లోకాస్ యాప్‌లో పెండింగ్ వివరాలు పొందుపరచాలని తెలిపారు. నాలుగేళ్లకు సంబంధించిన ఆడిట్‌ను పూర్తి చేసి ఆగస్టు చివరి వారంలో మహాజన సభలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, హెచ్‌డీఐఎఫ్ వంటి రుణాల రికవరీ శతశాతం చేయాలని ఆదేశించారు.



# చిట్టిపులివలస రోడ్డు పూర్తి

**వీరఘట్టం:** నాలుగు నెలల కిందట రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టిన చిట్టపులివలస రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారంతో పూర్తయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన ఈ పనులను ఇటీవల ప్రారంభించారు. ఐటీడీఏ నిధులతో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో చేపట్టిన ఈ రోడ్డు పనులు పూర్తికావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2014 హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ఈ రోడ్డు పాడైతే నేటికి పనులు పూర్తయ్యాయని గ్రామస్తులు తెలిపారు. ఈ రోడ్డు పనులను ఏఈ నాగభూషణరావు శుక్రవార పర్యవేక్షించారు.



పూర్తయిన చిట్టపులివలస బీటీ రోడ్డు